


WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 12 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 220 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY SEPTEMBER 12 2026 | VOL:18 | ISSUE: 220 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

# ఫాంహౌస్ నుంచే అసెంబ్లీపై కుట్ర!

**సభను అడ్డుకునేందుకు మూడు రోజులుగా బీఆర్ఎస్ అడ్డంకులు: సీఎం రేవంత్‌రెడ్డి**

**మహిళా అధికారుల ఎదుట అభ్యంతరకరంగా నిరసన.. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు**

**దళితుల నిరసనపై 'శుద్ధీకరణ'.. తీవ్రంగా ఖండించిన సీఎం**

**అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణకు ఆదేశాలు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థంగా ఎదుర్కొన్నారు.. రేవంత్‌రెడ్డి ప్రశంసలు**

**ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి**

**కులగణనలో తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలి**

**ఎమ్మెల్యేలు సభకు క్రమం తప్పకుండా హాజరై ప్రజా సమస్యలు ప్రస్తావించాలి**



శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు.సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు.పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు.

(మిగతా 2వ పేజీలో..)

## గల్వాన్ తర్వాత మారుతున్న సీన్.. మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన

**విభేదాలను పరిష్కరించుకుంటామని స్పష్టీకరణ**

**2019 తర్వాత భారత్‌కు జిన్‌పింగ్ తొలిసారి రాక**

**2024లో గస్తీ ఒప్పందంతో కీలక పరిణామం**

**వరుసగా మూడో ఏడాది మోదీ-జిన్‌పింగ్ భేటీ**

**బ్రిక్స్ సహకారంపై జిన్‌పింగ్ కీలక ప్రసంగం**

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం



(మిగతా 2వ పేజీలో..)

## మా జుట్టు పట్టుకుని లాగారు: ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

**అసెంబ్లీ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్**

**మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగారని ఆరోపణ**

**ఇది కుట్రలో భాగమేనని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్య**

**డీజీపీకి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని ఆవేదన**



తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానకరకరమైన ప్రవర్తన ఎదురైందని

(మిగతా 2వ పేజీలో..)

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం**

**సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన**

**ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని**

**బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ

(మిగతా 2వ పేజీలో..)




## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

**వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు**

**సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు**

**ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు**

**భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు**

**ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన**

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రధాన మళ్లింపులు ఇవే:

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్

(మిగతా 2వ పేజీలో..)



## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

**కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంపై కేటీఆర్ స్పందన**

**సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ**

**కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ**

**నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని వెల్లడి**

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం

(మిగతా 2వ పేజీలో..)





విజయకెరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# 30 శాతం ముస్లిం ఓట్లు డ్రాఫ్ట్ గల్లంతు

మహారాష్ట్రలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ఓటర్ల జాబితాలపై తీవ్ర చర్చను రేకెత్తిస్తోంది. ముస్లిం జనాభా 20 శాతానికి పైగా ఉన్న 38 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 30 శాతం ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల్లో కనిపించడం లేదు. సర్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. రాష్ట్ర సగటు తొలగింపు రేటు 21.1 శాతంగా ఉండగా, ఇది రెండు కోట్ల మందికి పైగా ఉంటుందని అంచనా. నిజమైన ఓటర్లను సర్ పేరుతో జాబితాల నుంచి తొలగించే ప్రమాదం ఉందన్న విమర్శలకు ఈ గణాంకాలు మరింత బలం చేకూరుస్తున్నాయి.ముస్లిం జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో తొలగింపు రేటు రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా నమోదైంది. ఈ 38 నియోజకవర్గాల్లో గత ఓటర్ల జాబితాలో ఉన్న 37 లక్షలకు పైగా మంది ఎన్యుమరేషన్ ఫారాలు 'అన్‌కలెక్టబుల్'గా గుర్తించబడ్డాయి. ఇది ఆ నియోజకవర్గాల్లోని మొత్తం ఓటర్లలో 29.7 శాతానికి సమానం. రాష్ట్రవ్యాప్తంగా సగటున 21.1 శాతం ఓటర్ల ఫారాలు సేకరించలేకపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని అసమాన తొలగింపులు జరిగాయన్న అనుమానాలు వ్యాప్తి చెందుతున్నాయి. ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో తొలగింపు రేటు ఎక్కువగా ఉండటం ఓటు హక్కుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### 'అన్‌కలెక్టబుల్' అంటే ఏమిటి?

ఓటర్ల జాబితాలో చోటు దక్కని వారిని వివిధ కారణాలతో 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు, మరణించినవారు, ఇంటి వద్ద లభ్యం కానివారు, డూప్లికేట్ ఎంట్రీలు ఉన్నవారు ఉన్నారు. ఎన్యుమరేషన్ ఫారం నింపేందుకు నిరాకరించిన వారిని కూడా 'ఇతరులు' విభాగంలో చేర్చారు.

### భివండి ఈస్ట్‌లో సగానికి పైగా తొలగింపు

ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోని భివండి ఈస్ట్‌లో గత జాబితాలో ఉన్నవారిలో 49.1 శాతం మంది కొత్త డ్రాఫ్ట్ జాబితాలో కనిపించలేదు. భివండి వెస్ట్‌లో 44.7 శాతం, కల్యా-ముంబ్రాలో 42.9 శాతం నమోదైంది. ముస్లిం జనాభా 51 శాతం ఉన్న భివండి ఈస్ట్‌లో 49.1 శాతం ఓటర్లు 'అన్‌కలెక్టబుల్'గా గుర్తించబడటం ఆందోళన కలిగిస్తోంది. ముంబైలోని మాన్‌ఖుర్ద్ శివాజీ నగర్‌లో ముస్లిం జనాభా 42.3 శాతం, చాందివలిలో 41.4 శాతం ఓటర్లు జాబితాలో లేరు. సియోన్-కోలివాడా, పూణే కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో కూడా తొలగింపు రేటు 40 శాతానికి మించింది. అత్యధిక ముస్లిం జనాభా 78.4 శాతం ఉన్న మాలేగావ్ సెంట్రల్‌లో తొలగింపు రేటు 23.4 శాతంగా నమోదైంది.

### ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో పరిస్థితి

షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేసిన 29 నియోజకవర్గాల్లో సగటు తొలగింపు రేటు 19.6 శాతం, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేసిన 25 నియోజకవర్గాల్లో 13.2 శాతంగా ఉంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న జిల్లాల్లో కూడా భారీ సంఖ్యలో ఓటర్ల తొలగింపునకు గురయ్యారు. పూణే జిల్లాలో 28.6 లక్షలు, థానేలో 28.5 లక్షలు, ముంబై సబర్బన్ జిల్లాలో 26.5 లక్షల మంది ఓటర్ల వివరాలు డ్రాఫ్ట్ జాబితాలో కొనసాగలేదు. ముస్లిం అధిక జనాభా ఉన్న ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ భారీ తొలగింపులు నమోదయ్యాయి.

### బీజేపీ పాలనలో ఓటు హక్కుపై పెరుగుతున్న అనుమానాలు

బీజేపీ పాలనలో ఎన్నికల ప్రక్రియపై ఇప్పటికే అనేక ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో సర్‌లో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల్లో లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో నిజమైన ఓటర్లను తొలగిస్తే ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కుకే ముప్పు ఏర్పడుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# ఫాంహౌస్ నుంచే అసెంబ్లీపై కుట్ర!

మొదటి పేజీ తరువాయి)

చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి)

దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మంచిర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.

# మా జుట్టు పట్టుకుని లాగారు: ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి)

ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేల బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

# గల్వాన్ తర్వాత మారుతున్న సీన్.. మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది.భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి.చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు.మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి.బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు: హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:



గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి)




ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

విజయకేరటం
తెలుగు దినపత్రిక
సెప్టెంబర్ | శనివారం | 12 | 2026



# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి





**నల్లగొండ సెప్టెంబర్ 11 విజయ కెరటం ప్రతినిధి**

ఈనెల 17న నిర్వహించనున్న "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి" అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్ల విషయమై శుక్రవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ నెల 17న నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథి సందేశానికి అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన నివేదికను వెంటనే ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సహా సకాలంలో హాజరు కావాలని చెప్పారు. ప్రజాపాలన దినోత్సవానికి హాజరుకావలసిందిగా రూపొందించే ఆహ్వాన పత్రికలను జిల్లాలోని అందరూ ప్రజా ప్రతినిధులు, అధికారులకు అందేలా చూడాలని నల్గొండ ఆర్ డి ఓ అశోక్ రెడ్డి ని ఆదేశించారు. పోలీస్ పరేడ్ మైదానంలో తాగునీరు, పారిశుధ్యం ఉండేలా చూడాలని నల్గొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ను ఆదేశించారు. ప్రథమ చికిత్స ఏర్పాట్లు, అవసరమైన మందులు, అంబులెన్స్ తో సహా ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ ను ఆదేశించారు. ఎప్పటిలాగే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలని డి ఈ ఓ ను ఆదేశించారు.ప్రజాపాలన దినోత్సవానికి అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రునాయక్ ను ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కుర్చీలు, టెంట్లు,ఇతర ఏర్పాట్లు చేయాలని, గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీలన్నింటిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ జాతీయ పతాక నిబంధనలను దృష్టిలో ఉంచుకొని జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు వారి సిబ్బందితో సహా నిర్దేశించిన సమయం ప్రకారం పోలీస్ పరేడ్ మైదానంలో హాజరు కావాలన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్ ,జిల్లా అధికారులు, ఈ సమావేశానికి హాజరయ్యారు .

## జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 18 ,19 తేదీల్లో కలెక్టరేట్ ముందు నిర్వహించే నిరాహార దీక్షలు విజయవంతం చేయండి

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . విజయ కెరటం .**

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజెయు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి , ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి తెలిపారు . ఈ నెల 18 ,19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు . జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలనే డిమాండ్‌తో ఈ నెల 18, 19 తేదీల్లో నల్గొండ కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఐజెయునల్గొండ జిల్లా కమిటీ ప్రకటించింది.ఈ దీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డిలు జర్నలిస్ట్ లతో కలిసి నల్గొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డికి శుక్రవారం ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు.జర్నలిస్టుల చిరకాల ఆకాంక్ష అయిన ఇండ్ల స్థలాల సాధన కోసం శాంతియుత పద్ధతిలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని, కాబట్టి ఈ రెండు రోజుల దీక్షలకు తగిన అనుమతులు మంజూరు చేయాలని వారు తమ లేఖలో కోరారు.ఈ సందర్భంగా టి.యు.డబ్ల్యు.జె. – ఐజెయు నల్గొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు గార్లపాటి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్ట్ ఇళ్లు , ఇళ్ల స్థలాల కోసం ఎన్ని సార్లు ధర్నా లు , ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు , ప్రజా ప్రతినిధులు తాత్కాలిక హామీ లు తప్ప తమ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు .ఈ నెల 18 ,19 తేదీలలో నిర్వహించే ఈ రిలే దీక్షలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు .ఈ కార్యక్రమం లో




ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు పరమేష్, ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్ , వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు సలీం , జిల్లా నాయకులు జిల్లా యాదయ్య , సాక్షి శ్రీనివాస్ రెడ్డి ,సయ్యద్,చింత యాదయ్య , రామ్ ప్రసాద్ , రెడ్డి పల్లి యాదగిరి , రెమిడాల మధు , ముచ్చర్ల విజయ్ , కారింగు శ్రీనివాస్ , దశరథ , సాగర్ , మదనా చారి , అశోక్, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు .

## పెండింగ్ కేసులను పరిష్కరించి నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి జిల్లా ఎస్పీ

**నల్లగొండ: సెప్టెంబర్ 11 విజయ కెరటం ప్రతినిధి**

జిల్లాలో నేర నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, చీదీఔ పెండింగ్ కేసుల పరిష్కారం, ఆస్తి నేరాల నియంత్రణ, సైబర్ నేరాలపై తక్షణ స్పందన తదితర అంశాలపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా దర్యాప్తులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసును నిర్దేశిత కాలవ్యవధిలో సమగ్రంగా దర్యాప్తు చేసి, అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సేకరించి నాణ్యమైన చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు.చీదీఔ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరారీలో ఉన్న నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాత కేసుల్లో నిందితుల కదలికలను పరిశీలిస్తూ, పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సూచించారు.సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత బ్యాంకులు, సైబర్ క్రైమ్ విభాగాలతో సమన్వయం చేసుకుని మోసపోయిన నగదును వీలైనంత త్వరగా ఫ్రీజ్ చేయించాలని ఆదేశించారు.బాధితుల నగదు ఫ్రీజ్ అయిన అనంతరం అవసరమైన చట్టపరమైన ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, బాధితులకు నగదు తిరిగి అందేలా పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల్లో ప్రతి నిమిషం కీలకమని, బాధితుల ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని ఎస్పీ స్పష్టం చేశారు.దొంగతనాలు, దోపిడీలు, చోరీలు తదితర ఆస్తి నేరాల్లో నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన ఆస్తిని పూర్తిస్థాయిలో రికవరీ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.జిల్లాలో గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న ప్రధాన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వాటి విక్రయాల వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై బాధ్యతాయుతంగా స్పందించి, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజల సమస్యలను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా చట్టపరమైన పరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. పోలీసుల పనితీరుపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.సమావేశంలో పెండింగ్ కేసులు, చీదీఔ కేసులు, గ్రేవ్ కేసులు, కోర్టు కేసులు, సైబర్ నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, ఆస్తి నేరాలు, చీణూా కేసులు, రోడ్డు ప్రమాదాలు, నేరస్థులపై నిఘా, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ తదితర అంశాలపై కేసుల వారీగా సమీక్ష నిర్వహించి, సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, నాణ్యమైన దర్యాప్తు, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీసుల ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.




## వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి

**డా. జి.వి. రమేష్, మండల ప్రత్యేక అధికారి**

**నల్లగొండ సెప్టెంబర్ 11 విజయ కెరటం ప్రతినిధి**




VBG RAM G కార్యక్రమంలో భాగంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ (VGPP) తయారీపై మండల పరిషత్ కార్యాలయం, నల్గొండలో గౌరవ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి డా. జి.వి. రమేష్ మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, వాటికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి, వచ్చే ఐదు సంవత్సరాలకు ఉపయోగపడే విధంగా పకడ్బందీగా, సమగ్రంగా VGPP ప్రణాళికను రూపొందించాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు అధికారులను కోరారు.సెప్టెంబర్ 15న గ్రామసభ నిర్వహించి, గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు మరియు ప్రణాళికపై విస్తృతంగా చర్చించాలని సూచించారు. సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు ట్రాన్సెక్ట్ వాక్ మరియు రిసోర్స్ మ్యాపింగ్ నిర్వహించి, గ్రామంలోని అందుబాటులో ఉన్న వనరులు, అవసరాలు మరియు అభివృద్ధి అవకాశాలను గుర్తించాలని కోరారు. సెప్టెంబర్ 19న గుర్తించిన అభివృద్ధి పనులను గ్రామసభ ఆమోదం పొందిన అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి పంపించాలని సూచించారు. గ్రామాల్లో కూలీల (వేజ్ సీకర్స్) సంఖ్యను పెంచి, ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు మరియు ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా చేరవేయాలని కోరారు. వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని, గ్రామాల భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామానికి అత్యవసరంగా అవసరమైన పనులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో చేర్చి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తే గ్రామాల అభివృద్ధికి మరింత మంచి అవకాశాలు ఏర్పడతాయని డా. రమేష్ తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ యాకూబ్ నాయక్ మాట్లాడుతూ, VBG RAM G కార్యక్రమం ద్వారా మొత్తం 22 విభాగాలకు సంబంధించిన 318 రకాల పనులను గ్రామాల్లో చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి గ్రామానికి అవసరమైన పనులను గుర్తించి VGPPలో చేర్చుకోవాలని కోరారు. ఆయా పనులకు సంబంధించిన మార్గదర్శకాలు, వివరాలను సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్ విధానంలో చికిత్స.

**యశోద హాస్పిటల్ సోమాజిగూడ డాక్టర్ మధుసూదన్ రెడ్డి.**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . విజయ కెరటం .**




యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ యూరాలజీ, ఆండ్రాలజీ మరియు రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండలో మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కిడ్నీ మరియు యూరినరీ స్టోన్స్, ప్రోస్టేట్ సమస్యలు, మూత్ర మార్గ ఇన్ఫెక్షన్లు, మూత్రం ఆగిపోవడం వంటి సాధారణ సమస్యల నుంచి క్లిష్టమైన యూరాలజీ సంబంధించిన సమస్యలను అవసరమైన పరీక్షలను నిర్వహించి రోబోటిక్ విధానంలో చికిత్సను అందజేస్తున్నామని తెలిపారు ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ నిరంతరం అవసరమైన పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సోమాజిగూడ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

**టీఎస్ఓబీఎంఎంఎస్‌లో సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11, విజయ కెరటం.**

రాష్ట్ర ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, వెనుకబడిన తరగతులకు (బీసీ) చెందిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది.బీసీ మహిళల ఉత్పాదకతను పెంపొందించడంతో పాటు, వారి కుట్టు వృత్తిని అభివృద్ధి చేసి, ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో నల్లగొండ పట్టణ పరిధిలోని అర్హత కలిగిన బీసీ మహిళలు టీఎస్ ఓబి ఎంఎంఎస్ పోర్టల్‌లో సెప్టెంబర్ 15, 2026లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హతలు:

1. బీసీ వర్గానికి చెందిన నిరుద్యోగ మహిళ అయి ఉండాలి.
2. ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి ఉండాలి.
3. కుటుంబ వార్షిక ఆదాయం రూ.2,00,000/-లకు మించరాదు.
4. దరఖాస్తుదారురాలి వయస్సు 18 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి.
5. ఆధార్ కార్డు కలిగి ఉండాలి.

దరఖాస్తుల సమర్పణ.

అర్హత కలిగిన మహిళలు ముందుగా టీఎస్ ఓబి ఎంఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన అనంతరం, సంబంధిత దరఖాస్తు ప్రతిని అవసరమైన పత్రాలతో కలిసి నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలి.కావున నల్లగొండ పట్టణ పరిధిలోని అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సెప్టెంబర్ 15, 2026లోగా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి, దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు కోరారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

## గుండెపోటుతో మాజీ సర్పంచ్ సంజీవయ్య మృతి

### వెల్లంపల్లి అభివృద్ధికి ఐదేళ్లపాటు విశేష సేవలు

**వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 11:**



పరకాల మండలం వెల్లంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తిక్క (పెండెల) సంజీవయ్య (60) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులతో ఇంట్లో మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే స్థానిక వైద్యుడిని సంప్రదించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు.సంజీవయ్య మృతితో వెల్లంపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపట్ల గ్రామస్థులతో పాటు పరకాల మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో గ్రామ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేసి ప్రజల మన్ననలు పొందారు.1982లో నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరిన సంజీవయ్య పరకాల మండలంలో పార్టీకి సంబంధించిన పలు బాధ్యతలు నిర్వహించారు. అనంతరం 1998లో వెల్లంపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ఐదేళ్లపాటు పదవిలో కొనసాగారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసిన ఆయన ప్రజాసేవలో తనదైన గుర్తింపు పొందారు. పరకాల మండల సర్పంచుల సంఘంలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు.మృతుడు సంజీవయ్య భార్య ఏడాది క్రితమే మృతి చెందారు. ఆయనకు ఒక్క కుమారుడు ఉన్నారు. సంజీవయ్య మృతిపట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించే అంత్యక్రియలకు గ్రామస్థులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మోర్చా బలోపేతమే లక్ష్యం

### కుసుమ సతీష్‌కు ఘన సన్మానం

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 11**



భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్‌ను ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాదాసు రాజు ఆధ్వర్యంలో నాయకులు కరీమాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుసుమ సతీష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కుసుమ సతీష్ మాట్లాడుతూ తనకు ఎస్సీ మోర్చా వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎస్సీలకు సముచిత గౌరవం, అవకాశాలు కల్పించడంతో పాటు వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. వరంగల్ జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాదాసు రాజు మాట్లాడుతూ సమాజంలో ఎస్సీలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తూ వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు. ఎస్సీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం పార్టీ మరింతగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర వీరస్వామి, ఉపాధ్యక్షులు తగరపు వీరస్వామి, మైదం వీరస్వామి, కార్యదర్శులు ఇల్లందుల కిషన్, మైదం సుదర్శన్, గబ్బెట ప్రవీణ్, గొలుసుల సదానందం, సీనియర్ నాయకులు పోలేపాక జనార్ధన్, జన్ను ప్రభాకర్, దామెర సదానందం తదితరులు పాల్గొన్నారు.

## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం'.. టీజర్‌కు టైమ్ ఫిక్స్!

### రేపు మధ్యాహ్నం 12 గంటలకు టీజర్ విడుదల

### హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి.. కీలక పాత్రలో నారా రోహిత్

### గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న సినిమా రిలీజ్

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు.గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది.ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




# నర్సంపేటలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష





**నర్సంపేట సెప్టెంబర్ 11 విజయ కెరటం ప్రతినిధి**

వరంగల్ జిల్లా నర్సంపేటలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ధర్మ పోరాట దీక్ష కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, ఓబీసీ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి లు హాజరై మహానీయులు మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రి బాయి దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగే జనగణలో బీసీ కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 2025 మే నెలలో నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు తీసుకున్న నిర్ణయాన్ని తుంగలో తొక్కి కులగణన శాస్త్రీయమైన పద్ధతిలో చేయకుండా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో ఓబీసీ కాలం చేర్చకుండా బీసీ కాలం లేకుండా, బిసీలకు అన్యాయం చేసిందని అన్నారు. రెండవసారి ఈ సంవత్సరం ఆగస్టు 17వ తేదీ నుండి జాతీయ జనగణన ప్రారంభించి కేంద్ర ప్రభుత్వం బీసీలను మళ్లీ మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జన గణనలో బీసీ కులాలకు ప్రత్యేక కాలం ఏర్పాటు చేసి బీసీల జనాభాను లెక్కించాలని అన్నారు దేశ జనాభాలో అత్యధిక ఉన్న బీసీ ఓబీసీ కుటుంబాల విరాళం వివరాలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు బీసీల జనాభా ఎంత ఉందో గణాంకాలు లేకపోతే జనాభా ప్రాతిపదికన విద్య ఉద్యోగం సంక్షేమ పథకాలు రాజకీయ ప్రాతినిధ్యం లో సరైన మాట ఎలా నిర్ణయించగలరు అని అన్నారు లేకపోవడం వల్ల బీసీలు సామాజిక ఆర్థిక విద్య మరియు రాజకీయ రంగాల్లో వెనుకబడే ప్రమాదం ఉందని కావున దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణలో ఓబీసీలకు ప్రత్యేక కాలం ఏర్పాటు చేసి కులగలను చేయాలని డిమాండ్ చేశారు. దీక్ష అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బొనగాని రవీందర్, బి ఆర్ పి పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రి సాగర్ లు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి పార్టీ జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్, బి ఆర్ పి పార్టీ రాష్ట్ర నాయకులు బుర్రి సాగర్, సిపిఎం పార్టీ నాయకులు అనంతగిరి రవి, బహుజన నాయకులు ఈదుల కృష్ణ, జన్ను రవి, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శులు మారబోయిన రాములు యాదవ్, సంగెం రమేష్, చీకటి ఓదేలు, బొనగాని రవీందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, దుగ్గొండి మండల కార్యదర్శి మోకిడే శ్రీకాంత్, మండల నాయకులు జినుకల కనుకమల్లు, ముదిరాజ్ సంఘం నాయకులు జినుకల కొమ్మాలు ముదిరాజ్, బీసీ నాయకులు కోండ్రోజు శ్రీనివాస్, కుండె రాజ్ కుమార్ యాదవ్, మేరుగు శంకర్ లింగం, వడిచర్ల రమేష్, ఓడపెల్లి గోవర్ధన్ లతో పాటు మహిళలు పాల్గొన్నారు.



# ఇంటెన్స్ లవ్ స్టోరీ, పీరియడ్ ఫిలింస్ చేయాలని ఉంది: రకుల్ ప్రీత్ సింగ్

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528